క్లుప్తంగా

శ్రీదేవీతల్లి ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో శ్రీదేవీతల్లి అమ్మవారి ఆలయ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పలువురు భక్తులు ఆలయ నిర్మాణానికి తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ఉమ్మలాడకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు పిల్లి ఈశ్వరరావు, పార్వతి దంపతులు రూ.10 వేలను విరాళంగా కమిటీ చైర్మన్ పల్లె అప్పలనాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివాదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలి


అధికారులకు సమస్య చెప్పుకుంటున్న అర్జీదారులు

మునగపాక: ప్రతి అధికారి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అర్జీలను పరిష్కరించేందుకు మండల స్థాయి అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురి నుంచి సమస్యలు సానుకూలంగా విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వివాదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలని, తగాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, డీటీ శేషుబాబు, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

యలమంచిలి రూరల్: మండలంలోని పులపర్తి గ్రామ శివారు ప్రాంతంలో పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ పోలీసులు శనివారం తెలిపారు. ఇక్కడ డబ్బు పణంగా పెట్టి 52 ముక్కలతో పేకాడుతున్న సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి రూ.17,400, పేకముక్కలు స్వాధీనపర్చుకున్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం


మాట్లాడుతున్న ఏవో ఆదినారాయణ

పాయకరావుపేట: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏవో పి.ఆదినారాయణ తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన శనివారం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి 35 మంది రైతులు తగ్గకుండా సిబ్బంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. మండలంలో 1210 రైతుల వద్ద నుంచి భూసార పరీక్ష కోసం మట్టి నమూనాలను సేకరించామన్నారు. సమావేశంలో రైతు శిక్షణ కేంద్రం, ఇందిరా క్రాంతి పథం కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం గ్రంథాలయంలో తనిఖీ


తనిఖీలు నిర్వహిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరమణ

అచ్యుతాపురం రూరల్: స్థానిక శాఖ గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరమణ శనివారం రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠకులకు ఏ విధమైన పుస్తకాలు అవసరమో తెలుసుకుని డిమాండ్ రిజిస్టార్‌లో రాయించాలన్నారు. గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తామని, తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించాలని కోరారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

పాయకరావుపేట: పట్టణంలో శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ ఇన్‌చార్జి వామాల లక్ష్మణ్‌రావు తెలిపారు. రోజూ ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు కథలు వినడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, నీతి కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్, డ్యాన్స్, చెస్, క్యారమ్, జీకే, క్విజ్ మొదలుగునవి నేర్పిస్తామన్నారు. విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

తాగునీటికి కటకట

- అచ్యుతాపురంలో నీటి ఎద్దడి
- వేసవి తాపానికి గురవుతున్న గ్రామస్తులు
- కుంటిసాకులతో తప్పించుకుంటున్న అధికారులు
- 400 అడుగులు మేర బోరు తవ్వినా అందని జలాలు


పార్టీ మీటింగులకు ప్రాంగణంగా మారిన ప్రకృతి సహజ సిద్ధమైన చెరువు

అచ్యుతాపురం రూరల్: పారిశ్రామిక ప్రాంతం అచ్యుతాపురంలో ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. వీధి కుళాయిలు పని చేయకపోగా, చేతిపంపుల నుంచి వచ్చే అరకొర నీరు చాలక అవస్థలు పడుతున్నారు. కొంతమంది తాగునీటి సమస్య పరిష్కారం కోసం మోటారు బోరు తీయిద్దామంటే 400 అడుగులు తవ్వించినా నీరు రావడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోతుందని గ్రామస్తులు వాపోతున్నారు.

పని చేయని పంచాయతీ కుళాయిలు

అప్పులు చేసి బోరు వేసుకుందామనుకున్నా సుమారు 400 అడుగులు లోతులో కూడా నీటి జలాలు అందని పరిస్థితి నెలకొంది. అచ్యుతాపురంలో చెరువులు ఆక్రమణకు గురవ్వడం వల్ల నీటి నిల్వలు లేకపోవడం కారణంగా బోరుల్లో నీరు అందడం ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు పంచాయతీ కుళాయిలు పనిచేయకపోవడంతో స్థానికులు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న బోర్లలో నీటి నిల్వలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దాంతో రానున్న మే, జూన్ నెలల్లో మంచినీళ్ల కోసం పడరాని పాట్లు పడాల్సిందేనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కబ్జాలతో చెరువులు, బావులు కనుమరుగు

సెజ్ ఏర్పాటుకు ముందు అచ్యుతాపురం గ్రామానికి గెడ్డలు, వాగులు, చెరువులతో పుష్కలంగా నీటి నిల్వలు ఉండేవి. చక్కగా వ్యవసాయం జరిగేది. ప్రజలందరికీ మంచినీటికి ఎటువంటి ఇబ్బంది ఉండేదికాదు. ఏ నాయకులు, అధికారులపై ఆధార పడకుండా గ్రామంలో పెద్ద చెరువు, దానిని ఆనుకుని ఒక మంచినీటి బావి ఉండేవి. ప్రకృతి సహజసిద్ధంగా కొండల నుంచి గెడ్డల ద్వారా చెరువుల్లోకి వచ్చే నీటి నిల్వల కారణంగా గ్రామంలో పుష్కలంగా నీరు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేది. వర్షపు నీరు కొండల నుంచి సహజ సిద్ధంగా ప్రవాహం రావటానికి గెడ్డలు కబ్జాలకు గురవ్వడంతో చెరువులు, బావులు కనుమరుగయ్యాయి. ఆ స్థలంలో పార్టీ మీటింగులకు గ్రౌండ్ గానూ, ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పడటంతో స్థానికులు తాగునీటికి అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా మొండి చేయి మిగులుతోంది. పారిశ్రామిక స్థావరంగా ఏర్పడిన అచ్యుతాపురంలో నేటికి మహిళలు మంచి నీటి కోసం బిందెలు నెత్తిన పెట్టుకుని కిలోమీటర్ల దూరం నుంచి తెచ్చుకునే దుస్థితి నెలకొందంటే, ఇక్కడి అధికార యంత్రాంగం పనితీరుకు అద్దం పడుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నిరుపయోగంగా ఉన్న వీధి కుళాయిలు

నీళ్లు అడుక్కోవాల్సి వస్తోంది



నెలల తరబడి మంచినీటి కుళాయిలు లేక ఇరుగు పొరుగు వారిని నీళ్లు అడుక్కోవాల్సి వస్తోంది. పలు మార్లు పంచాయతీ వారిని అడిగితే పైపు లైన్ రిపేర్ చేయాల్సి ఉందన్నారు. రోడ్లు విస్తరణ పనులు పూర్తయ్యాక పైపులైన్ పనులు చేపడతామన్నారు. వేసవి కావడంతో మంచినీటికి చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు త్వరితగతిన మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. – వరలక్ష్మి, అచ్యుతాపురం

రోజూ మంచినీరు కొనుగోలు చేస్తున్నాం



రోజూ మంచినీరు కొనుక్కుని తాగే పరిస్థితి నెలకొంది. నెలకు వేలల్లో మంచినీటికి ఖర్చు చేయాల్సి వస్తోంది. వీధి కుళాయిలు ఉన్నప్పుడు పుష్కలంగా నీటిని తాగేవారం. ఇప్పుడు రోజూ నగదు చెల్లించి నీరు కొనుక్కుని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. వేసవి కావడంతో బోర్లు ఎండిపోయాయి. డబ్బులిచ్చినా నీరు దొరక్కపోయే పరిస్థితి రావచ్చు. అధికారులు వేసవి ప్రారంభంలోనే జాగ్రత్త పడితే, ప్రజలు మంచి నీటికి ఇబ్బందులు పడకుండా మేలు చేసినవారవుతారు. – కుమారి, అచ్యుతాపురం

వంతెన పునఃనిర్మాణానికి శంకుస్థాపన


వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన హోంమంత్రి అనిత

కోటవురట్ల: పందూరు వరాహ నదిపై వంతెన పునఃనిర్మాణానికి హోం మంత్రి అనిత శనివారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ వంతెనను రూ.5.75 కోట్లతో పీఆర్ ప్రాజెక్ట్సు ద్వారా నిర్మిస్తారని తెలిపారు. జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి, టీడీపీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీను పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరు.

పందూరు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే రూ.5.75 కోట్లు మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కృషితో ఆనాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియలో ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వమే నిధులు మంజూరు చేసినట్టుగా హోం మంత్రి మళ్లీ అవే పనులకు శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు విమర్శించారు.

మునగపాకలో కొవ్వొత్తుల ప్రదర్శన


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక: కశ్మీర్‌లో ఉగ్రదాడిలో అసువులు బాసిన పర్యాటకులకు గ్రామీణ యువజన మందిరం ఆధ్వర్యంలో శనివారం రాత్రి మునగపాకలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్, కార్యదర్శి ఆడారి సూర్యచంద్రరావు, దాడి మూసిలినాయుడు, ఆడారి అచ్చియ్యనాయుడు, టెక్కలి పరశురామ్, ఆడారి కాశీబాబు, జల్లేపల్లి కిష్టప్ప, దాడి శివ, శరగడం జగన్, బొడ్డేడ మహేష్, పూసర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాకలో అయిదు రోజులుగా దోమల మందు పిచికారీ పనులు జరుగుతున్నాయి. శనివారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇంటి ఆవరణలో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలలన్నారు. వార్డు సభ్యుడు దాడి పోలీసు పాల్గొన్నారు.

వినూత్నంగా ఉపాధ్యాయుల ప్రచారం

కోటవురట్ల: కె.వెంకటాపురంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థులను చేర్చుకునేందుకు శనివారం ప్రచారం నిర్వహించారు. విద్యార్థులు సాధించిన మార్కులు, వారి ఫొటోలతో ఫ్లెక్సీని గ్రామంలో ఏర్పాటు చేశారు. అనంతరం ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సదుపాయాలు, విద్య గురించి వివరించారు.

సెల్ టవర్ వద్దంటూ ఆందోళన


మునగపాకలో సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ ఆందోళన చేస్తున్న దృశ్యం

మునగపాక: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ శనివారం మునగపాక బైపాస్ రోడ్డులో పలువురు ఆందోళనలు దిగారు. ప్రజారోగ్యాలతో చెలగాటమాడే టవర్ నిర్మాణం తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. పంచాయతీ అనుమతులు లేకుండా సెల్ టవర్ నిర్మించడం సరికాదంటూ గృహ యజమానులు నిరసన చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా టవర్ నిర్మాణం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం తగదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పనులు నిలుపుదల చేయాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్కలి పరశురామ్, ఎంఎం నాయుడు, గంగరాజు, ఆడారి జోగి శ్రీనివాసరావు, టెక్కలి కిషోర్, ఆడారి హేమంత్ సాయి, ఆడారి ప్రసాద్, సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు రాళ్లు తొలగించిన వ్యక్తిపై కేసు

మునగపాక: మండలంలోని నాగులాపల్లి, జేపీ అగ్రహారం గ్రామాల మధ్య సరిహద్దు రాళ్లను తొలగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు శనివారం తెలిపారు. జేపీ అగ్రహారంలోని పాతిన సర్వే రాళ్లను అదే గ్రామానికి చెందిన కాశీ మహేశ్వరరావు తొలగించారంటూ వీఆర్వో, సర్వేయర్లు స్థానిక తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై సరిహద్దు చట్టం 1923 ప్రకారం తగు చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఐకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ప్రసాదరావు తెలిపారు.

అంబరాన్నంటిన గంధం అమావాస్య జాతర


కొరుప్రోలు నూకాంబిక

ఎస్.రాయవరం: మండలంలో కొరుప్రోలు, ఎస్.రాయవరం, పేటసూధిపురం గ్రామాల్లో గంధం అమావాస్య జాతర వైభవంగా నిర్వహించారు. కొరుప్రోలులో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి తుని కళాకారుల కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

గంధం అమావాస్యకు ఘనంగా ఏర్పాట్లు


కూచిపూడి నృత్యాలతో అలరిస్తున్న చిన్నారులు

నక్కపల్లి: గంధం అమావాస్య పండగను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దేవవరం, వేంపాడు, ఉద్దండపురం, గొడిచర్ల, పాయకరావుపేట, నక్కపల్లి, నెల్లిపూడి, అమలాపురం, చందనాడ తదితర గ్రామాల్లో నూకాలమ్మ ఆలయాలను ముస్తాబు చేశారు.

పాలిసెట్ కోచింగ్ అభినందనీయం


విద్యార్థులకు కోచింగ్ ఇస్తున్న రాజారావు

ఎస్.రాయవరం: గ్రామీణ విద్యార్థులకు ఉచిత పాలిసెట్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమని సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్ అవార్డు గ్రహీత రాజారావు తెలిపారు. పెదగుమ్ములూరు పాఠశాలలో నెల రోజులుగా ఇస్తున్న పాలిసెట్ కోచింగ్‌ను ఆయన పరిశీలించారు. కొంతసేపు విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో పలు మండలాల నుంచి విచ్చేసిన విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేసి కోచింగ్ ముగిస్తామని పీఆర్టీయూ మండల కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

ముమ్మరంగా పోలీసు సోదాలు


ఎస్‌పీవోబీ పోలీస్ సెక్యూరిటీకి సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు


బార్క్ కూడలిలో బస్సులో ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ గణేష్

ఎస్.రాయవరం: పహెల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో బంగారమ్మపాలెం శివారులో ఎస్‌పీవోబీ పోలీస్ సెక్యూరిటీకి నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. రైల్వే, బస్సు స్టేషన్ల ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద డ్రోన్ కెమెరా ఎగుర వేసి పరిశీలించి నిఘా పెంచారు.

అచ్యుతాపురంలో నాకాబందీ

అచ్యుతాపురం రూరల్: మండలంలో నాకాబందీ నిర్వహించారు. కొండకర్ల, బార్క్ కూడలిలో సీఐ నమ్మి గణేష్ వాహనాలు తనిఖీ చేశారు. అచ్యుతాపురంలో హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీలు నిర్వహించారు. పూడిమడక తీరంలో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మత్స్యకారులకు మెరైన్ సీఐ సింహాద్రినాయుడు అవగాహన కల్పించారు. బోట్లు తనిఖీ చేశారు.


పట్టణంలో ముస్లిం వీధిని పరిశీలించిన సీఐ అప్పన్న

పాయకరావుపేట: పట్టణంలో ముస్లిం స్థావరాలను పరిశీలించినట్లు సీఐ జి.అప్పన్న తెలిపారు. మసీదులు, పలు వ్యాపార, నివాస ప్రాంతాలను వాహనాలను కూడా తనిఖీ చేశామన్నారు.

కోటవురట్ల: పాతరోడ్డు జంక్షన్ వద్ద ఎస్ఐ రమేష్, పాములవాక పట్టాలమ్మతల్లి ఆలయం వద్ద ఏఎస్ఐ గంగరాజు సిబ్బందితో కలిసి వాహన తనిఖీ నిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.